క్లుప్తంగా

రెండు గ్రామాల్లో నేడు 'గడప గడపకు'

మునగపాక : మండలంలోని వెంకటాపురం, రామారాయుడుపేట గ్రామాల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



చిత్రలేఖనం పోటీలకు హాజరైన విద్యార్థులు

మునగపాక : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు శివకోటి దుర్గా ప్రసాద్, పిల్లా జగదీష్ కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం మునగపాక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శెలవులను వృథా చేయకుండా గ్రంథాలయాల్లో నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ పాల్గొన్నారు.

తల్లి మొదటి గురువు



విద్యార్థులకు హనుమాన్ జననం, తల్లి ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న వక్తలు

పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం హనుమాను జన్మదినం సందర్భంగా సుందరకాండను చదివి వినిపించారు. అదే విధంగా మదర్స్ డే సందర్భంగా తల్లి ప్రాముఖ్యతపై, తల్లి మొదటి గురువు అని విద్యార్థులకు హితబోధ చేశారు. తల్లిని అందరూ గౌరవించి, పూజించాలని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉద్బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తత అవసరం

కోటవురట్ల : రానున్న 5 రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి కుటుంబాన్ని కలుసుకుని వడగాడ్పులు, ఉక్కపోత పై అప్రమత్తత కల్పించాలన్నారు. అంతేకాకుండా కార్యదర్శులు అన్ని గ్రామాల్లో టముకు ద్వారా ప్రజలకు సమాచారం అందించాలన్నారు. బయట తిరిగేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సాధ్యమైనంత వరకు కాటన్ దుస్తులు ధరించి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరం



దిమిలి గ్రంథాలయంలో విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన లభిస్తుందని లైబ్రేరియన్ ఎస్. శకుంతల తెలిపారు. ఆదివారం వేసవి శిబిరంలో కథలు చెప్పినట్లు తెలిపారు. అలాగే కోలాటంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఖోఖో ఆటపై అవగాహన కల్పించి ఆడించడం జరిగిందన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

రాంబిల్లి: కుమ్మరాపల్లి గ్రామంలో దుర్గాలమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేల వేషాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం, వినోదం



గ్రంథాలయంలో మొక్కలు నాటిస్తున్న దృశ్యం



చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పద్యాలు చెప్పిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు

- విద్యార్థుల నుంచి విశేష స్పందన
- నియోజకవర్గంలో 10 గ్రంథాలయాల్లో కార్యక్రమాలు

నక్కపల్లి : విద్యార్థుల కోసం గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా కల్పిస్తుండడంతో ఈ శిబిరాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని గ్రంథాలయ సంస్థ, విద్యాశాఖ నిర్ణయించాయి. మండల కేంద్రాల్లో ఉన్న శాఖా గ్రంథాలయాలతోపాటు, గ్రామీణ గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వచ్చే నెల 10 వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయి. ఈ వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు మంచి సృజనాత్మకతను పెంచే విధంగా చిత్రలేఖనం, పుస్తకపఠనం, పేపర్ క్రాఫ్ట్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రంథాలయానికి సగటున 50 మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్నారు. ఇంగ్లిష్‌లో చదివించడం, రాయించడం వంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు ఇంగ్లిష్ పట్ల ఉన్న భయాన్ని పోగొట్టే అవకాశం ఉందని ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్ ఆచార్యులు తెలిపారు. తెలుగు పదాలు, పద్యాలు, వ్యాకరణం, చందమామ కథలు, నీతి కథలు సుమతీ శతకాలు, వేమన పద్యాలు వాటి అర్థాలు వంటివి నేర్పించడం ఆటపాటలతో ఈ కార్యక్రమాలన్నింటిని చేపట్టడం వల్ల విద్యార్థులకు ఆసక్తి పెరిగి క్రమం తప్పకుండా ఈ శిబిరాలకు వస్తున్నారని ఆయన తెలిపారు. పద్య పఠనం వల్ల మానసిక వికాసంతో పాటు, ఏకాగ్రత లభిస్తుందన్నారు. ధారణ శక్తి వల్ల చక్కని ఆరోగ్యం కలుగుతుందన్నారు. బాల్యం నుంచే పద్య పఠనంపై ఆసక్తి పెరిగేలా సెలవుల్లో ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. శతక పద్యాలను నేర్చుకోవడం వల్ల నైతిక విలువలు పెరుగుతాయన్నారు. చిన దొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేసవి శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. వారం రోజుల నుంచి ఈ శిబిరానికి విద్యార్థులు క్రమం తప్పకుండా వస్తున్నారు. నక్కపల్లి, ఉపమాక, పాయకరావుపేట, చినదొడ్డిగల్లు, ఎస్.రాయవరం, సర్వసిద్ధి, కొరుప్రోలు, కోటవురట్ల తదితర శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన విజ్ఞానంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన మొక్కలు నాటే కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించడం జరుగుతోందని లైబ్రేరియన్ జనార్దన్ తెలిపారు. దేశనాయకుల జీవిత చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉన్నత చదువుల కోసం ప్రణాళికలు, విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా గ్రంథాలయాల్లో ఆటపాటలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌పై అవగాహన వంటి కార్యక్రమాలను కూడా నేర్పించడం జరుగుతోందన్నారు.

వేసవి శిబిరాలు ఎంతో ఉపయుక్తం

వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. వేసవి కాలం ఎండ వేడిమి ఎక్కువగా ఉండడం, వడగాడ్పులు వీచే సమయంలో విద్యార్థులకు నీడ పట్టున విజ్ఞానాన్ని, వినోదాన్ని కలిగించే ఈ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. తెలుగు, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సంపాదించడం, భయాన్ని పోగొట్టేందుకు దోహదపడుతున్నాయి. తెలుగులో వ్యాకరణం, చందస్సు, పద్యాలు వంటివి నేర్పించడం జరుగుతోంది. ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం, గ్రామరు, వాక్య నిర్మాణం వంటివి నేర్పించడం జరుగుతోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎస్.వి.ఎస్.ఆచార్యులు,
తెలుగు ఉపాధ్యాయుడు

తాగునీరు కలుషితంపై ఫిర్యాదు



చెరువుల ద్వారా విడుదలైన వ్యర్థ జలాలతో కలుషితమైన తాగునీరు

పాయకరావుపేట : వెంకటనగరం గ్రామంలో తాగునీరు కలుషితం కావడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సమీపాన వున్న చేపల చెరువులకు సంబంధించిన వ్యర్థ జలాలను పక్కనే వున్న కాలువలోకి విడిచిపెడుతున్నారు. దీనికి సమీపాన గల తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లోనికి కలుషిత నీరు వెళ్లిపోవడం వల్ల తాగునీరు పూర్తిగా కలుషితమైపోతుందని గ్రామ సర్పంచ్ వంకా రమణ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాగునీరు కలుషితం కావడం వల్ల మోటారు ద్వారా సంపులోకి కూడా మురుగునీరు చేరిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చేపల చెరువుల ద్వారా విడుదల చేసే వ్యర్థ జలాలను నిరోధించాలని, రక్షిత తాగునీరు సరఫరా విభాగం అధికారులు పరిశీలించి పైపులైన్ సరి చేయాలని సర్పంచ్ రమణ అధికారులను కోరారు.

బ్రాండిక్స్ 106వ కంటి వైద్య శిబిరం

- 425 మందికి ఉచిత కంటి పరీక్షలు
- 10 మంది రక్తదానం



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ అపారెల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత 106వ కంటి వైద్య శిబిరంలో 425 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరంలో బ్రాండిక్స్ సిబ్బంది తమ సేవల్ని అందించారు. 296 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 95 మందికి మందులు అందజేయగా, 55 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. పక్కన నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్త దానాన్ని చేశారు. రెండు శిబిరాలకు విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, భోజన సదుపాయాన్ని బ్రాండిక్స్ సంస్థ కల్పించింది. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



పీఎన్ఆర్ పేటలో స్వామిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

ములకలాపల్లిలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

యలమంచిలి : మండలంలో ములకలాపల్లి గ్రామంలో ఆదివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అభయాంజనేయస్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, గ్రామ సర్పంచ్ దుబాయ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

మండలంలో పీఎస్ఆర్‌పేట, పేటబయ్యవరం గ్రామాల్లో అభయాంజనేయ స్వామి వారి జయంతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభయాంజనేయస్వామి వారి దర్శనానికి భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. అభయాంజనేయ స్వామి వారిని ఎంపీపీ దర్శించుకున్నారు. గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివలక్ష్మి శివ, బయ్యవరం మాజీ సర్పంచ్ మొగ్గ గోవిందరావు పాల్గొన్నారు.

శ్రీరామ దూతం శిరసా నమామి

- ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు
- పలు గ్రామాల్లో అన్న సమారాధనలు



మల్లవరంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం



దిమిలిలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



మునగపాకలో..



దార్లపూడిలో హనుమాన్ పూజలు



నక్కపల్లిలో..



సైతారుపేటలో గుర్రాల పోటీల విజేతకు బహుమతి ప్రదానం



పాయకరావుపేటలో స్వామిని దర్శించుకున్న చిక్కాల రామారావు, దగ్గుపల్లి సాయిబాబా



హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మునగపాక సంతబయిల అభయాంజనేయ స్వామిని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కాండ్రేగుల మణికంఠ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

పాయకరావుపేట : హనుమాన్ జన్మదినం సందర్భంగా మండలంలో గల ఆయా గ్రామాల్లో హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో గల మంగవరం, పెంటకోట, పాయకరావుపేట, కుమారపురం, గుంటపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పట్టణంలో గల లింగాలకాలనీ హనుమాన్ ఆలయంలోను, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం, మల్లవరం ,పూడిమడక, దోసూరు, తంతడి, మార్టూరు, తిమ్మరాజుపేట, కొండకర్ల, ఇరువాడ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పలు చోట్ల అన్నసమారాధనలు జరిపారు. ఇరువాడ పరిధిలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

కోటవురట్ల : జై హనుమాన్ జై శ్రీరామ్ నినాదాలు హోరెత్తాయి....కైలాసపట్నంలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీహనుమాన్ శోభయాత్రను శోభాయమానంగా నిర్వహించారు. తొలుత అంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు పాదయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్ర కైలాసపట్నం నుంచి కోటవురట్ల తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 2000 మంది భక్తుల పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, సమరసత సేవా ఫౌండేషన్ నర్సీపట్నం డివిజన్ ధర్మ ప్రచారక్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాంబిల్లి : దిమిలిలో ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారద నది సమీపంలో గల సంతోషి మాత ఆలయం వద్ద గల ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో దిమిలి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. ఆంజనేయస్వామి సన్నిధిలో భజనలు, పారాయణం నిర్వహించారు.

నక్కపల్లి : హనుమజ్జయంతి సందర్భంగా నక్కపల్లిలో అభయాంజనేయస్వామి ఆలయంలో వేదపండితులు శ్రీపాద ప్రణవ్‌రామ్, పసరకొండ పండుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆంజనేయ హోమాలు, తమలపాకు పూజలు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మన్యుసూక్త సహిత అభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామ సింధూర నాగవల్లి దళ పుష్పార్చన నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేకువ జామునుంచే స్వామివారి దర్సనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

ఎస్.రాయవరం : మండలంలో దార్లపూడి అడ్డురోడ్డు, పి.ధర్మవరం, ఎస్.రాయవరం తదితర గ్రామాల్లో శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సైతారుపేటలో అభయాంజనేయస్వామి వార్షికోత్సవంతో పాటు హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. స్వామికి సింధూర, తమలపాకు పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. రామన్నపాలేనికి చెందిన సీహెచ్ విక్రం మొదటి బహుమతి గెలుచుకున్నాడు. విజేతకు ఉత్సవ కమిటీ రూ. 20 వేలు నగదు బహుమతి ఇచ్చారు.

ఆలయంలో మైక్‌సెట్‌కు రూ.70 వేలు వితరణ



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు నగదు అందిస్తున్న నరసింహారెడ్డి, లావణ్య దంపతులు

అనకాపల్లిటౌన్ : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయానికి మైక్‌సెట్ నిమిత్తం కడపజిల్లా రాజంపేట గ్రామానికి చెందిన మెట్టా నరసింహారెడ్డి, లావణ్య దంపతులు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం రూ.70 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, ముత్తా శ్రీనివాసరావు, వాకాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు



సదస్సులో మాట్లాడుతున్న జయచంద్ర

అనకాపల్లిటౌన్ : రూఫ్‌గార్డెన్‌తో ఇంటికి, శరీరానికి మేలు చేకూరుతుందని బయోటెక్నాలజీ శాస్త్రవేత్త కె.జయచంద్ర అన్నారు. పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గ్రీన్ క్లబ్, గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన రూఫ్ గార్డెనింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రత ప్రభావాలను తగ్గించడంలో రూఫ్‌గార్డెన్ సాగు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటివి నగరాల్లో నివాసాలకు చలువపందిళ్లు అని, పచ్చని ఆవాసం–ప్రకృతితో సావాసమని పేర్కొన్నారు. రూఫ్‌గార్డెనింగ్‌లో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, జిల్లాకు చెందిన రూఫ్‌గార్డెన్ సంఘ సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తుపాను భవనం శిథిలం



పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలోని తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట బాధితుల రక్షణార్థం ప్రభుత్వం తుపాను భవనం నిర్మించింది. అయితే కొంత కాలంగా దీని నిర్వహణ లేకపోవడంతో శిథిల దశకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ భవనంలో స్థానికులు పశువులు కట్టుకొంటున్నారు. భవనం ఏ సమయంలో కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. భవనాన్ని తొలగించాలని అధికారులను కోరినా వారు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న తుపాను భవనాన్ని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : మండలంలో జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నరసింగరావుపేట మోదకొండమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు అమ్మవారిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిల్, వైఎస్సార్‌సీపీ నేతలు ఎ.అప్పారావు, కరణం సురేష్, రమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.